అస్తవ్యస్తంగా డి-74 కెనాల్

- పూడుకుపోయి కంపుకొడుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న మూడు గ్రామాల ప్రజలు
- కెనాల్ ఆధునికీకరణకు కరువైన నిధులు


చిన్నయానం వద్ద కెనాల్ పరిస్థితి

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల పరిధిలో ఉన్న డి-74 ప్రధాన కాలువ అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడికక్కడ పూడుకుపోయి ఆనవాళ్లు లేకుండా మారింది. కెనాల్‌పై ఎక్కడపడితే అక్కడ కల్వర్టులు నిర్మించడంతో పాటు పిచ్చిమొక్కలు, చెత్తతో నిండి పోయింది. దీనికి తోడు డ్రైనేజీ నీరు కూడా కాలువలో చేరడంతో అధ్వానంగా మారి కంపుకొడుతోంది. డొంకేశ్వర్‌తో పాటు చిన్నయానం, గాదేపల్లి, జీజీ నడ్కుడ గ్రామాల మధ్య నుంచి ఈ కెనాల్ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షపు నీరు నిలిచి దోమలకు నిలయంగా మారింది. కాలువ సక్రమంగా లేకపోవడంతో వరదనీరు కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కెనాల్ అక్కడక్కడ పూడుకుపోతుండడంతో ఎత్తిపోతల సాగునీరు సైతం కింది ఆయకట్టుకు అందడం లేదు. ఈ కారణంగా పంటలు సాగు చేస్తున్న రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కెనాల్ ఆధునీకరించడానికి నిధులు తెప్పించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. ఉపాధిహామీ ద్వారా పూడికతీత పనులు చేపడితే కూలీలకు కూడా ఉపాధి లభిస్తుంది.

దోమలతో ఇబ్బందిగా ఉంది

నీటి కాలువ ఊరి మధ్య ఉంది. చెట్లు పెరిగి చెత్తతో పూర్తిగా నిండిపోయి మురికికూపంలా తయారైంది. కెనాల్ పక్కకే ఉండడంతో దోమలు ఇళ్లలోకి విపరీతంగా వస్తున్నాయి. మురికితో దుర్వాసన వస్తోంది. పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించాలి.

– నిమ్మల గణేష్, చిన్నయానం

నిధులు వస్తేనే..

పూడుకుపోతున్న కాలువను పూడికతీసి ఆధునీకరణ పనులు చేపట్టాలంటే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాలి. నిధులు కావాలని గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మురికినీరు కెనాల్‌లోకి వదలడం మరింత ఇబ్బందిగా మారుతోంది.

– ప్రవీణ్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ

సీజనల్ వ్యాధులపై అవగాహన


రెంజల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రావణ్ కుమార్

రెంజల్(బోధన్): సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రావణ్ మార్ తెలిపారు. దండిగుట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం ఉండాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్యం వైద్యురాలు ఫిర్దోష్ ఫాతిమా అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బీసీ వసతి గృహన్ని సందర్శించి 80 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పటికప్పు చేతులను కడుక్కోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం పట్టణంలోని కెనాల్ కట్ట, ఒడ్డెర కాలనీ, జెమ్మన్ జెట్టి, ప్యాట్ల హనుమాన్, పిప్రిగల్లిలో డ్రైడే డ్రైవ్ నిర్వహించారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శాంత, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట పరిధిలో..


నవీపేటలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నవీపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కావ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావ్, సూపర్‌వైజర్ కిషన్, బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల హెడ్మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిధుల మంజూరుకు హామీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో మున్నూరు కాపు సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి హామీ ఇచ్చారు. మామిడిపల్లిలో నాలుగు పంథాలకు చెందిన మున్నూరు కాపు సంఘం పెద్ద మనుషులు మంగళవారం పెర్కిట్‌లో వినయ్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో కేటాయించిన స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కౌన్సిలర్ ఆకుల రాము, నాయకులు రవి గౌడ్, కాశీరాం, అయ్యప్ప శ్రీనివాస్, ఆకుల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌కు నిధులు..



ఆర్మూర్: నందిపేట మండలంలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25 లక్షల మంజూరు ఉత్తర్వులను ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఆర్మూర్ పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, నిధుల మంజూరీకి సహకరించిన వినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

ఎంపీ అర్వింద్‌కు పరామర్శ



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల బీజేపీ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో ఎంపీ అర్వింద్‌ను కలిసి పరామర్శించారు. ఎంపీ అరివింద్ తండ్రి డి.శ్రీనివాస్ ఇటీవల కన్నుమూశారు. దీంతో నాయకులు ఎంపీని కలిసి తమ సంఘీభావం తెలియజేశారు. ఆలూర్ మండల బీజేపీ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్ తదితరులున్నారు.

యూనిఫాంలు పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ వెంకటరమణ యూనిఫాంలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న యూనిఫాంలు, పుస్తకాలను సక్రమంగా ఉంచుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం సాబేర బేగం, వీడీసీ సభ్యుడు గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంగార్డు వైద్యానికి విద్యార్థుల చిరు సహాయం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అన్నాచెల్లెల్లు ఎస్ మణిదీప్, ఎస్ శరణ్య వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ముత్తెన్న శస్త్ర చికిత్స కోసం మంగళవారం తమ వంతుగా రూ.500 చొప్పున చిరు సహాయం అందజేశారు. హోంగార్డు ముత్తెన్నకు ఇటీవల రక్తపోటు అధికం కావడంతో మెదడులో నరాలు చిట్లిపోయి తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ముత్తెన్నకు శస్త్ర చికిత్స నిర్వహించారు. దీంతో విద్యార్థులు తమ వంతుగా చిరు సహాయాన్ని హెచ్‌ఎం నరేందర్‌కు అందజేశారు. హెచ్‌ఎం సైతం తనవంతుగా రూ.2 వేలను ముత్తెన్న కుటుంబ సభ్యులకు ఫోన్‌పే ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థుల ఉదార స్వభావాన్ని అభినందించారు. ఉపాధ్యాయులు మోహన్, విఠల్, లింబాద్రి, గంగా మోహన్ తదితరులున్నారు.

కడుపు నొప్పితో బాలిక మృతి

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లికి చెందిన ఐశ్వర్య(11) అనే బాలిక కడుపు నొప్పితో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. సోమవారం కడుపు నొప్పితో బాధపడుతుండగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బాలిక తల్లి లలిత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


కార్యదర్శికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

బోధన్: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సాలూర మండలంలోని హున్స జీపీ కార్యదర్శి శ్రీనివాస్‌కు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రతినిధులు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సమస్యల పై చర్చించారు. గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు యేశాల గంగాధర్, మండల ప్రతినిధులు షేక్ నజీర్, దేవదాస్, సింగాడి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


చేపూర్ కాలనీలో నిర్మిస్తున్న కచ్చా డ్రెయినేజీ

సాక్షి ఎఫెక్ట్..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని హరిపూర్‌కాలనీలో గల రోడ్డుకు మంగళవారం అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. సోమవారం 'సాక్షి' దినపత్రిలో ' చినుకు పడితే చిత్తడే' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ ప్రత్యేక అధికారి లక్కం ప్రభాకర్, కాలనీలో గల రోడ్డుపై జేసీబీతో బురదను తొలగింపచేశారు. అలాగే మురికి , వర్షపు నీరు రోడ్డుపై రాకుండా తాత్కాలింగా కచ్చా డ్రైనేజీ ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని లక్కం ప్రభాకర్ తెలిపారు.

వర్షాల కోసం రోటీ పండగ


తాడ్‌బిలోలిలో భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

రెంజల్(బోధన్): వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో అభివృద్ధి సాధించాలని కోరుతూ తాడ్‌బిలోలిలో మంగళవారం రోటీ పండుగ నిర్వహించారు. రెండు రోజులుగా గ్రామస్తులు వర్షాల కోసం ఆలయంలో సప్త నిర్వహిస్తున్నారు. చివరి రోజు రోటీ పండగ నిర్వహించి అన్నదానం నిర్వహించారు. ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెల్మల సుధాకర్‌రావ్, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు నర్సయ్య, శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు లింగాల అబ్బన్న, సాయరెడ్డి, లింగం, ప్రతాప్‌రెడ్డి, జగన్‌రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని 16 గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడారు. జీపీలో పనిచేస్తున్న కార్మికులందరూ దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు చెందిన వారని, వీరిని వెంటనే ప్రభుత్వం పర్మినెంట్ చేసి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. యూనియన్ అధ్యక్షులు పద్మ, కారోబార్ల సంఘం అధ్యక్షుడు రాజు తదిపారులున్నారు.

త్వరలోనే రెండు గ్రామాల సరిహద్దులను నిర్ణయిస్తాం



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్, కుర్నాపల్లి గ్రామాల మధ్యన నెలకొన్న సరిహద్దు సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని బోధన్ డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఇరు గ్రామాల సరిహద్దుకు సంబంధించిన వివరాలను ప్రజల సమక్షంలో సేకరించారు. జిల్లా సర్వే కార్యాలయంలో సైతం రెండు గ్రామాలకు సంబంధించిన సరిహద్దులు సూచించే ఫైల్ లేదని, ప్రజల సహకారంతో సరిహద్దు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం


వర్నిలో మొక్కలు నాటుతున్న ఏబీవీపీ నాయకులు


బోధన్‌టౌన్: రక్తదానం చేస్తున్న ఏబీవీపీ నేతలు

వర్ని: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని వర్ని మండల కేంద్రంలో విద్యార్థి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెలంగాణ చౌరస్తాలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మోడల్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. వర్ని మండల కార్యదర్శి ప్రవీణ్, సంజయ్, దేవా, మాధవ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

బోధన్‌టౌన్(బోధన్): ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మధుమాలాంచ జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇందూర్ జిల్లా ప్రముఖ్ తలాండె ఈశ్వర్ కుమార్, సీనియర్ నాయకులు ఇండ్ల సూర్యకుమార్‌లు మాట్లాడారు. 25 మందితో ప్రారంభమైన ఏబీవీపీ ఈ రోజు దేశ వ్యాప్తంగా లక్షలాదిగా విస్తరించి విద్యారంగ సమస్యలపై బాధ్యతతో పోరాడుతోందన్నారు. రాష్ట్ర వనవాసీ సెల్ కన్వీనర్ లక్ష్మణ్ చౌహాన్, అమర్ సింగ్, గంగాసింగ్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే


వివరాలు తెలుసుకుంటున్న హెచ్‌ఈవో గోవర్దన్

రుద్రూర్: కోటగిరి మండలం వినాయకనగర్‌లో ఏడీసీఎఫ్ (ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం హెచ్‌ఈవో గోవర్దన్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఐదేళ్లలోపు చిన్నారుల ఇళ్లకు వెళ్లి నీళ్ల విరేచనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారులకు నీళ్ల విరేచనాలు ఉంటే తల్లి పాలు తప్పకుండ ఇవ్వాలని, ఆస్పత్రికి వెళ్లి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఈవో గోవర్ధన్ మాట్లాడుతూ.. చిన్నారుల మరణాలను తగ్గించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం నెలాఖరు వరకు కొనసాగుందని వివరించారు. ఆరోగ్య కార్యకరల్తు శ్రీదేవి, గంగామణి పాల్గొన్నారు.

12న ఊర పండుగకు ముడుపు


హనుమాన్ మందిరం వద్ద సమావేశమైన వివిధ కులాల పెద్దలు, వీడీసీ ప్రతినిధులు

బోధన్‌టౌన్(బోధన్): ఈ నెల 12న ఉదయం 11 గంటలకు గ్రామం నడిబొడ్డున ముడుపు కట్టనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని నడిఊరు హనుమాన్ ఆలయం వద్ద వివిధ కుల సంఘాల పెద్దలతో పాటు వీడీసీ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడు బాగారెడ్డి యాదవ్ మాట్లాడారు. గ్రామ నడి బొడ్డున ముడుపు కట్టిన అనంతరం ఈ నెల 20న ఊర పండుగ నిర్వహించడానికి సమావేశంలో కుల సంఘాల పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. వర్షాలు బాగా కురిసి, పాడి పంటలు బాగా పండాలని కోరుతూ గ్రామ దేవతకు మొక్కులు చెల్లించడం జరుగుతుందన్నారు.

జీతాలు ఇప్పించేలా చర్యలు తీసుకోండి


అలీసాగర్ లిఫ్టు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, నేతలు

ఎడపల్లి(బోధన్): జాన్కంపేటలోని అలీసాగర్ లిఫ్టు ఇరిగేషన్ పంప్ హౌస్ వద్ద మంగళవారం లిఫ్టు పంప్‌హౌజ్‌లో పనిచేసే కార్మికులు ధర్నా చేశారు. అలీసాగర్, గుత్ప లిఫ్ట్ ఇరిగేషన్లో పనిచేసే దాదాపు 80 మంది కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని మంగళవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. వేతనాలు ఇవ్వాల్సిన కాంట్రాక్టర్ ఆరు నెలలుగా ఇవ్వడం లేదని, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.

స్వర్ణకార సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మారోజు


మారోజు సుధాకర్‌చారికి నియామక పత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

బోదన్‌టౌన్(బోధన్): స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మారోజు సుధాకర్‌చారీ నియమితులయ్యారు. మంగళవారం స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్యదర్శి చేపూరి వెంకటస్వామి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మంచోళ్ల రాజమౌళి, రాష్ట్ర సలహాదారులు బ్రహ్మం, జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి శ్రీనివాస్, కోశాధికారి అశోక్, బోధన్ విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు కనోజ్ ప్రభాకర్‌చారీ, స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడు జనార్దన చారీ, కార్యదర్శి నాగరాజులు ఉన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



రుద్రూర్: టీపీసీసీ సభ్యుడు కాసుల బాలరాజుకు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చెర్మన్‌గా నియమించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం కోటగిరి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ డెలిగేట్ కొట్టం మనోహర్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడేవారిని కాంగ్రెస్ అధిష్టానం గుర్తిస్తుందని అన్నారు. నాయకులు శ్రీనివాస్ రావ్, బర్ల మధు, కిశోర్ బాబు,ఆనంద్, విఠల్ పాల్గొన్నారు.

సన్మానం



అన్వేష్ రెడ్డికి..

వేల్పూర్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన పచ్చలనడ్కుడ కాంగ్రెస్ నేత ఎస్ అన్వేష్ రెడ్డిని మంగళవారం గ్రామ కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. నాయకులు నర్సారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈరవత్రి అనిల్‌కు..



మోర్తాడ్: రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌ను ఖనిజాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి మంగళవారం సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

బోనాల ఊరేగింపు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రియ మహిళా మండలికి చెందిన మహిళలు మంగళవారం గ్రామ దేవతలకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం చేశారు. చిన్నాబజార్‌లో లక్ష్మీనారాయణ మందిరం నుంచి 80 మంది మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పెద్ద బజార్‌లో ఉన్న ముత్యాలమ్మ తల్లికి జలాభిషేకం చేశారు. వర్షాలు కురవాలని గ్రామదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. కౌన్సిలర్ సంగీత ఖాందేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏజీపీగా మహ్మద్ గౌసొద్దీన్



బోధన్: బోధన్ 5వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి ఏజీపీ(అడిషనల్ గవర్నరమెంట్ ప్లీడర్)గా సీనియర్ న్యాయవాది మహ్మద్ గౌసొద్దీన్ నియమితులయ్యారు. సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉత్తర్వులను జారీ చేశారు. ఆరు నెలల పాటుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మహ్మద్ గౌసొద్దీన్ గతంలో మున్సిపల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు.

సమాచారం

12న వాహనాల వేలం

బోధన్‌టౌన్(బోధన్): వివిధ కేసుల్లో పట్టుబడి ఎక్సైజ్ కార్యాలయంలో పెట్టిన వాహనాలకు ఈ నెల 12న ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ పవన్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన చేశారు. 4 ద్విచక్ర వాహనాలకు రాకాసీపేట్‌లోని కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభం అవుతుందన్నారు.

13న గురుపూజోత్సవం

నవీపేట: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న సాయంత్రం మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ మండల ప్రతినిధి నాంపల్లి వసంత్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ వేడుకలకు ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు శరత్ చంద్ర, ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచార ప్రముఖ్ వకుళాభరణం, రామ్‌నరేష్‌లు హాజరవుతారని పేర్కొన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడం నేరం

వేల్పూర్: తారురోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు నడపడం చట్టరీత్యా నేరమని, అలా నడిపితే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని వేల్పూర్ ఎస్సై వినయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను తారురోడ్లపై నడపడం వల్ల రూ. వందల కోట్లతో నిర్మించిన రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. ట్రాక్టర్ల యజమానులు దీనిని గుర్తించి కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను ఇతర వాహనాలపై పొలాలకు తీసుకెళ్లాలని సూచించారు. అలా కాకుండా రోడ్లపై తిప్పితే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	డెస్పికబుల్ మీ-4 (తెలుగు) – 11.40, 2.00, 4.20, 6.40, 9.00
స్క్రీన్-2 –	కల్కి -2898ఏడీ (3డీ తెలుగు) – 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3 –	కల్కి -2898ఏడీ (తెలుగు) – 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	కల్కి-2898ఏడీ (తెలుగు) – 11.30, 3.15, 7.00, 10.45